దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

చైతన్యపురి: చైతన్యపురి మాజీ కార్పొరేటర్‌పై రేవంత్ అన్న సైన్యం అనే యూట్యూబ్ రీల్స్‌లో దుష్ప్రచారం చేయటాన్ని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, త్రివేధి మాట్లాడుతూ.. 2008లో టి.విఠల్‌రెడ్డి అనే వ్యక్తి వద్ద తాను స్థలం కొనుక్కున్నానని నిరంజన్ అనే వ్యకి మీడియాతో చెప్పగా కొన్ని యూట్యూబర్లు మాత్రం మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి అని, కొందరు కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేయటం విడ్డూరంగా ఉందన్నారు. మూసీ ప్రాంతంలో రెవెన్యూ అధికారులు రెడ్ మార్కింగ్ చేస్తున్న సమయంలో అక్కడ ఉన్న మీడియాతో నిరంజన్ మాట్లాడిన మాటలకు ప్రభుత్వ స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులు అమ్ముకున్నారని జిన్నారం విఠల్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్, కవిత ఫొటోలు జోడించి సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని ఆరోపించారు. ఓ పక్క పేదల ఇళ్లను కూల్చుతూ మరో పక్క బీఆర్ఎస్ నాయకులపై దుష్ప్రచారం చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, పవన్, వీరన్నయాదవ్ తదితరలు పాల్గొన్నారు.


ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేస్తున్న మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు..

సోషల్ మీడియాలో తనపైనే కాక కేసీఆర్, కేటీఆర్, కవిత ఫొటోలు పెట్టి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, న్యూమారుతీనగర్ కాలనీవాసి నిరంజన్ వేర్వేరుగా చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సత్యశోధక సమాజ్ వార్షికోత్సవం


సమావేశంలో పాల్గొన్న అనసూయి, భగవంతరెడ్డి

వనస్థలిపురం: తెలంగాణ అధ్యయన వేదిక, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సత్యశోధక సమాజ్ 151వ వార్షికోత్సవం సందర్భంగా వనస్థలిపురం బీసీ వసతి గృహంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీఓడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, తెలంగాణ అధ్యయన వేదిక కన్వీనర్ కట్ట భగవంతరెడ్డి పాల్గొని సత్య శోధక సమాజ్ ఆశయాలు, జ్యోతి బాపూలే విద్యావ్యాప్తి, కుల నిర్మూలన కోసం చేసిన కృషిని వివరించారు. వెనుకబడిన దళిత విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, విద్యా సౌకర్యాలు, రిజర్వేషన్లు అందుతున్నాయంటే అది జ్యోతిబా పూలే, అంబేడ్కర్, పెరియార్ రామస్వామి వంటి మహానుభావుల కృషి వల్లే అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత బీసీ సంక్షేమ ఉప కమిషనర్ బాలచందర్, రాష్ట్ర పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బీజే ఎం.రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి ఐఎస్‌సదన్‌లోని సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో పర్యటించారు. కాలనీలో గతేడాది నిర్మించిన బాక్స్‌డ్రైన్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు పూడిక పేరుకుపోయిందని వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ జెడ్సీ దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో పలు రహదారులను సీసీ రోడ్లుగా మార్చాలని, నిలిచిపోయిన సరూర్‌నగర్ చెరువు సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరగా దశలవారీగా సమస్యల పరిష్కరానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ దేవేందర్, ఏఈ అన్సారి, నాయకుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


ఐఎస్‌సదన్‌లో జెడ్సీతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు హర్షణీయం


మాట్లాడుతున్న మామిడి రాంచందర్

మన్సూరాబాద్: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చేయటం హర్షణీయమని ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ నేత మామిడి రాంచందర్ అన్నారు. మన్సూరాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటన చేయటం హాస్యాస్పదమన్నారు. దేవుడిని కూడా రాజకీయాలకు వాడుకోవడం కేవలం చంద్రబాబుకే చెల్లిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలచే విచారణ జరిపిస్తే బాబు బాగోతం బయటపడుతుందన్నారు. జీడీ నర్సింహా, యోసోబు, మల్లేష్, ఆకుల వెంకటేష్, ప్రవీణ్, రాంబాబు పాల్గొన్నారు.

అమ్మోరు వేడుకలకు ఆలయాలు ముస్తాబు

సైదాబాద్: దసరా పండుగ పురస్కరించుకొని తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించే దేవీ శరన్నవరాత్రి వేడుకలకు అమ్మవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయాలకు కొత్త రంగులు వేసి రకరకాల పువ్వులు, విద్యుత్ దీపాలతో చూడముచ్చటగా అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు ఆలయాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. సైదాబాద్ మాతామైదాన్‌లో కొలువుదీరిన విజయదుర్గా మాతా ఆలయం, జీవన్‌జ్యోతి సంఘంలోని జయదుర్గా మాతా ఆలయం, ఐఎస్‌సదన్ డివిజన్ పెద్దతోటలోని వాగాంబ్రి మాతా ఆలయాలను సుందరంగా అలంకరించారు.


విద్యుత్ దీపాలతో ముస్తాబైన విజయదుర్గామాత ఆలయం

రోజుకో అలంకరణ..

ఈ నెల 3 (గురువారం) నుంచి నవరాత్రి వేడుకలు అంగరంగా వైభవంగా జరగనున్నాయి. అమ్మవారు తొమ్మిది రోజుల పాటు తొమ్మిది రకాల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. సైదాబాద్ విజయ దుర్గా మాతా ఆలయంలో అమ్మవారు మొదటి రోజు శ్రీస్వర్ణకవచ దుర్గాదేవి అలంకారంలో, ఆ తర్వాత వరుసగా బాలత్రిపుర సుందరిదేవి, శ్రీగాయత్రిదేవి, శ్రీఅన్నపూర్ణదేవి, శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి, శ్రీమహాలక్ష్మిదేవి, శ్రీమహా సరస్వతిదేవి, శ్రీదుర్గాదేవి, శ్రీమహిషాసుర మర్ధిని అలంకరణలో కొలువుదీరనున్నారు. ఈ నెల 12న విజయ దశమి పురస్కరించుకొని అమ్మవారు శ్రీవిజయదుర్గా దేవి అలంకారంలో దర్శనమిస్తారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పల్లకిపై సైదాబాద్ పురవీధుల్లో ఊరేగిస్తారు. అదేరోజు సాయంత్రం ఆలయాల్లో శమీపూజతో వేడుకలు ముగిస్తాయని నిర్వాహకులు వెల్లడించారు.


మాతామైదాన్‌లో కొలువుదీరిన అమ్మవారు


వేడుకలకు సిద్ధమైన పెద్దతోటలోని వాగాంబ్రి మాత దేవాలయం

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ.53, వంకాయ రూ.35, బెండ రూ. 40, పచ్చిమిర్చి రూ. 18–28, కాకర రూ. 45, బీర రూ. 23–45, క్యాబేజీ రూ.19, ఫ్రెంచి బీన్స్ రూ. 70, క్యారెట్ రూ. 40, దొండ రూ. 35–40, చిక్కుడు రూ. 28–55, గోకర రూ. 40, బీట్‌రూట్ రూ. 26, క్యాప్సికం రూ. 70, ఆలు రూ. 39, దోస రూ. 28, సొర రూ. 19, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 44–49, చామగడ్డ రూ. 40. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సన్మానం

దిల్‌సుఖ్‌నగర్: గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్లు బండి మధుసూదన్ రావ్, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, జిన్నాం వెంకటేష్ గుప్తా, మచ్చేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు దేప భాస్కర్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ మాట్లాడుతూ.. మధుసూదన్ రావు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి పదవి వరించిందని రాబోయే రోజులలో కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. మార్కెట్ పాలక మండలి సభ్యులందరూ అనునిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ రైతులు తెచ్చే పండ్లు, ఫలాలు దళారుల చేతిలో పడకుండా గిట్టుబాటు ధర వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పున్న గణేష్ నేత, ఉపేందర్ రెడ్డి, ధనరాజ్ గౌడ్ రవీంద్ర, సైదులు, శివ, భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

‘సాక్షి’ ఎడ్యుకేషన్ కాపీలతో విజ్ఞానం



విద్యార్థులకు సాక్షి ఎడ్యుకేషన్ కాపీలను అందజేస్తున్న రమేష్

మీర్‌పేట: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు మాదరి రమేశ్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ‘సాక్షి’ ఎడ్యుకేషన్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం నిష్ణాతులైన విద్యావంతులతో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఈ కాపీలను ప్రత్యేకంగా తయారు చేసి అందజేస్తుందన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా అన్ని సబ్జెక్టులను క్లుప్తంగా వివరించడంతో పాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ తదితర విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు కాపీలు అందజేసిన వారికి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సరళ కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య పనులలో నిర్లక్ష్యం వహించొద్దు

డీసీ తిప్పర్తి యాదయ్య

ఎల్‌బీనగర్: పారిశుధ్య పనులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని, ఎప్పటికప్పుడు కాలనీలలో ఉన్న చెత్తను తొలగించాలని హయత్‌నగర్ సర్కిల్ డీసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య సూచించారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో శానిటేషన్ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనాలు చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో ఎక్కడ కూడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా ఇళ్ల వద్దకు వచ్చే ఆటోలకే ఇవ్వాలన్నారు. హోటళ్లలోని వ్యర్థాలను డ్రైనేజీలలో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సూపర్‌వైజర్లకు సూచనలిస్తున్న డీసీ

నిధుల మంజూరుకు వినతి

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని మంగళవారం కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ముంపు సమస్య పరిష్కారానికి ఎల్‌బీనగర్ నుంచి సరూర్‌నగర్ ప్రియదర్శి పార్కుల వరకు వరద నీటి కాలువ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ నిర్మాణం పూర్తయితే పలు కాలనీలకు ముంపు సమస్య తీరుతుందన్నారు. గ్రీన్ పార్క్ కాలనీలో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులలో ఆటంకాలను తొలగించి పనులను పూర్తి చేయాలని, పలు చోట్ల డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అదనపు డ్రైనేజీ పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజశేఖర్‌రెడ్డి

కార్మికులకు రిక్షాలు, ట్రాలీల అందజేత


రిక్షాలు, ట్రాలీలు అందజేస్తున్న కార్పొరేటర్, ఏఈ సుజాత

చైతన్యపురి: చెత్త తరలించే రిక్షాలు, ట్రాలీలను మంగళవారం చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా, ఏఈ సుజాత పారిశుద్ధ కార్మికులకు అందజేశారు. విస్తరిస్తున్న కాలనీలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చెత్త సేకరణకు రిక్షాలను పెంచాలని, ఇందులో భాగంగానే అదనంగా చెత్త రిక్షాలు అందజేయడం జరిగిందని కార్పొరేటర్ అన్నారు.ఈ కార్యక్రమంలో డీఈ చందన, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, నాయకులు వినోద్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, రాంమోహన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

చంద్రపురికాలనీలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశ ప్రజలు సుభిక్షంగా ఉన్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా యువ మోర్చా ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, రాకేష్‌యాదవ్, భాస్కర్‌రావు, భార్గవతేజ, రంజీత్, జీవన్‌రెడ్డి, సాయి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

80 మంది కూలీలు.. 60 ఇళ్ల కూల్చివేత



చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట శంకర్‌నగర్‌లో మంగళవారం మూసీ నిర్వాసితుల ఇళ్లను 80 మంది కూలీలు, రెవెన్యూ, విద్యుత్ అధికారులు, పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతల పనులు ప్రారంభించారు. నిర్వాసితులు ఎవరూ అడ్డుపడటం, వ్యతిరేకించడం జరగలేదు. దాదాపు 60 ఇళ్లను కూల్చినట్లు అధికారులు తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే మిగతా ఇళ్లను కూల్చుతామన్నారు. పలు చానళ్ల హడావుడి తప్ప నిర్వాసితుల ఆందోళన లేదని రాజకీయ నాయకులు కూడా అధికార యంత్రాంగానికి సహకరిస్తున్నారని అధికారులు వెల్లడించారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

మలక్‌పేట: ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నల్గొండకు చెందిన గిరిబాబు దిల్‌సుఖ్‌నగర్ భవానీనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లోని 3వ అంతస్తులో భార్య పిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 29న బంధువుల్లో ఒకరు చనిపోవడంతో కుటుంబంతో సహా నల్లగొండకు వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలోని తులంన్నర బంగారం, 29 తులాల వెండి, రూ.3000 నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

దసరా సెలవులు.. ఇళ్లకు విద్యార్థులు



మన్సూరాబాద్: దసరా నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. డివిజన్ పరిధి వివేకానందనగర్‌కాలనీలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల వద్దకు పిల్లలను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు రావడంతో కోలహలంగా మారింది. అదే విధంగా గణేష్‌నగర్‌కాలనీలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, సూర్యోదయనగర్‌కాలనీలోని గురుకుల బాలికల కళాశాల, ఆటోనగర్‌లోని మైనార్టీ బాలుర పాఠశాలల విద్యార్థులు ఇంటిబాట పట్టారు.

పూల పండగొచ్చింది!


ఎల్‌బీనగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో..


బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


ఎల్‌బీనగర్ సిరినగర్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి అందంగా బతుకమ్మలను పేర్చి ఆడిపాడి సందడి చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మన పండుగలు సంప్రదాయాల గురించి తెలిపేందుకు బతుకమ్మ ఉత్సవాలు పాఠశాలల్లో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. –ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


సాయినగర్‌లోని ఆకృతి రాకెటౌన్ స్కూల్లో..


శాంతినికేతన్ విద్యాసంస్థలో..


వనస్థలిపురం నారాయణ పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు


బతుకమ్మలతో చిన్నారులు, ఉపాధ్యాయులు


బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


జైపురికాలనీ ప్రభుత్వ పాఠశాలలో..